క్లుప్తంగా

చురుగ్గా పారిశుధ్య పనులు



గడసాంలో పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులు

దత్తిరాజేరు: మండలంలోని గడసాంలో రెండు రోజులుగా పారిశుధ్య పనులు చురుగ్గా చేపడుతున్నట్లు గ్రామపెద్ద నేతేటి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘ నిధులతో పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కాలువల్లో మురుగు తీయడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రీసర్వేపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఆశయ్య

మెరకముడిదాం: రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలని చీపురుపల్లి ఆర్డీఓ బి.ఆశయ్య సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి చెందిన వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లు, రెవెన్యూ కార్యాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్ అజూరఫీజాన్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి వేతనదారుల సమస్యలపై ఆరా..



శింగరాయి సచివాలయంలో వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని శింగరాయి సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించి సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉపాధి వేతనదారులతో మాట్లాడుతూ.. పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ ఉపాధి పనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనిలో ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి



సదనం సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్జేడీ చిన్మయిదేవి

గజపతినగరం రూరల్: బాలసదనంలో అందుతున్న సేవలపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి హెచ్చరించారు. గురువారం స్థానిక బాలసదన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదన్‌లో ఎంతమంది బాలికలు చేరుతున్నారని.. వారికి అందిస్తున్న ఆహారం, వసతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలసదన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని, నిర్వహణ కూడా బాగుందని సిబ్బందిని అభినందించారు. పరిశీలనలో ఆమెతో పాటు సూపర్‌వైజర్లు, సదనం పర్యవేక్షకురాలు సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

25న కంటి వైద్య శిబిరం

నెల్లిమర్ల: జరజాపుపేటలో ఈ నెల 25న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సాధన యువజన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలుబోతు దుర్గాప్రసాద్, పశుమర్తి వెంకటరమణ గురువారం తెలిపారు. ఈ నెల 25న జరజాపుపేటలో సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయడం జరుగుతుందన్నారు. కంటి రోగులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా హనుమజ్జయంతి..



వేపాడ: మండల కేంద్రంలోని హనుమాన్‌కు పంచామృతాభిషేకం



బొండపల్లి: వేంద్రాంలోని రామదండు యువత ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువత



దత్తిరాజేరు: కోమటిపల్లిలో పూజలు చేస్తున్న అర్చకులు



గజపతినగరం: అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు రామకృష్ణ



గంట్యాడ: పెదవేమలి ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కోరిన వారికి కోరిన రూపంలో దర్శనమిస్తాడు.. ఆర్తిగా పిలిచేవారికి ఆపన్న హస్తం అందిస్తాడు.. భగవంతుడు, భక్తుడు ఒక్కటయ్యే మార్గానికి వారధి మన హనుమ. రాముడెంత ఘనుడో.. రామభక్తుడైన హనుమ కూడా అంతే ఘనుడని భక్తుల నమ్మకం. అటువంటి హనుమ జయంతిని గురువారం వాడవాడలా వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేపట్టారు. సిందూరం, తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానాలు చేపట్టారు. అలాగే పలుచోట్ల ఆంజేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలతో పాటు శోభాయాత్రలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



వేపాడ: దబ్బిరాజుపేటలో హనుమాన్ జయంతి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గుర్ల: వల్లాపురంలో పూజలు చేస్తున్న యువత



చీపురుపల్లి రూరల్: గరివిడి మండలం దేవాడలో విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జమ్ము సత్యం, ప్రభాత్‌కుమార్, మైలపల్లి కృష్ణ, గెరిడ రామారావు, కిరణ్, కూర్మ, వెంకి, తదితరులు



గజపతినగరం: భూదేవిపేటలోని ఆంజనేయ స్వామి ఆలయ నిర్వహణకు రూ. 50 వేలు అందిస్తున్న ఉపాధ్యాయుడు కె.చంద్రరావు, కుటుంబ సభ్యులు



ఎస్.కోట: చైతన్య కాలేజ్ జంక్షన్‌లో స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రెవెన్యూ సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

- కలెక్టర్ అంబేడ్కర్



ఎస్.కోట సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

శృంగవరపుకోట : రెవెన్యూ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో వేటు తప్పదని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. గురువారం స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారంలో చాలా మంది అలసత్వం వహిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చే వినతుల్లో 90 శాతం రెవెన్యూ సమస్యలే ఉంటున్నాయని.. దీనికి కారణం రెవెన్యూ ఉద్యోగులేనని చెప్పారు. మన ముందుకు వచ్చిన సమస్యను సత్వరమే పరిష్కరించాలన్న తపన ఉద్యోగుల్లో ఉండాలన్నారు. రీసర్వేలో వచ్చిన వినతులను వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, ఇళ్ల స్థలాల పరిశీలన, నీటిపన్ను, రీసర్వే, పీజీఆర్ఎస్ వినతులు వంటి అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఆక్రమణదారులతో దరఖాస్తులు పెట్టించి, క్లియర్ చేయాలని.. రెండు రోజుల్లో అన్ని గ్రామాల్లో ఆక్రమిత భూముల జాబితాలు తన వద్దకు రావాలని స్పష్టం చేశారు. ఇదే విషయమై మళ్లీ వినతులు వస్తే సంబంధిత వీఆర్వోలపై చర్యలు తప్పవన్నారు. రీసర్వే తప్పిదాలను సవరించి, భూ యజమానులకు సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. నీటిపన్ను వసూళ్ల లక్ష్యాలను సాధించాలన్నారు. పనితీరు ఆధారంగా బదిలీలు ఉంటాయని, సిఫార్సులు చేస్తే మాత్రం చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళి, ఆర్డీఓ వెంకటేశ్వరరావు, ఐదు మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

కానరాని సిబ్బంది..



గజపతినగరం ఒకటో సచివాలయంలో సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం సమయంలో ఒక్కరు కూడా కార్యాలయంలో లేకపోవడం విశేషం. ఈ విషయాన్ని ఎంపీడీఓ కల్యాణి వద్ద ప్రస్తావించగా.. సిబ్బంది సమయపాలనపై దృష్టి సారిస్తామన్నారు. లంచ్ అవర్‌లో కూడా సిబ్బంది బయటకు వెళ్లకూడదని స్పష్టం చేశారు.

- గజపతినగరం రూరల్

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్

- జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయరాజ్‌కుమార్

గజపతినగరం రూరల్: మెగా లోక్‌అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం చేకూరుతుందని స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయరాజ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక కోర్టు హాల్‌లో సిబ్బంది, న్యాయవాదులతో మాట్లాడుతూ.. వచ్చేనెల 5వ తేదీన నిర్వహించనున్న మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

ఇప్పటికే చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని.. లోక్ అదాలత్ ద్వారా వాటికి పరిష్కారం చూపాలన్నారు. సమావేశంలో పలువురు న్యాయవాదులతో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

శతశాతం రాయితీపై పూలు, పండ్ల మొక్కలు

బొండపల్లి: ఉపాధి హామీ పథకం నిధులతో రైతులకు శతశాతం రాయితీపై పూలు, పండ్ల మొక్కలు అందించనున్నట్లు ఏపీఓ జి.అరుణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సన్న, చిన్నకారు రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ రైతులు అర్హులని పేర్కొన్నారు. 25 సెంట్ల నుంచ 5 ఎకరాల్లోపు భూమి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపాధి క్షేత్ర సహాయకులకు గాని ఎంపీడీఓ కార్యాలయంలో గాని దరఖాస్తులు అందించాలని సూచించారు. పట్టాదారు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో పాటు ఆధార్, జాబ్‌కార్డు జిరాక్స్‌లను దరఖాస్తుకు జత చేయాలన్నారు. అలాగే ఏ పంట సాగు చేస్తున్నారో తెలియజేయాలని పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

వేపాడ: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా శతశాతం రాయితీపై అందిస్తున్న పండ్లు, పూల మొక్కలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని హార్టికల్చర్ అధికారి పి. పద్మ కోరారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. సన్న, చిన్నకారు రైతులు తమ ఆధార్, వన్‌బీతో ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25 సెంట్ల నుంచి ఐదెకరాల పొలం ఉన్నవారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు సంబంధిత ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడిని సంప్రదించాలని సూచించారు.

లింగ నిర్ధారణ నేరం



సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఆశయ్య

- ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఆశయ్య

చీపురుపల్లి: లింగ నిర్ధారిత పరీక్షలు చేయించుకోవడం చట్టరీత్యా నేరమని.. అలా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఆశయ్య అన్నారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం అమలు – తీసుకునే చర్యలపై వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో నెలకొన్న పురుష సంతాన ప్రాధాన్యత కారణంగా ఆడపిల్లలు పట్ల వివక్ష పెరుగుతోందన్నారు. మూఢ నమ్మకాల కారణంగానే కడుపులో పెరుగుతున్న ఆడ శిశువులను అంతమొందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రభుత్వం సున్నా నుంచి ఆరు సంవత్సరాల వయసు గల బాలికల లింగ నిష్పత్తిని పెంచేందుకు పీసీ అండ్ పీఎన్‌డీటీ 1994 చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఆడ శిశువుల భ్రూణ హత్యలను నిలువరించేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. లింగ నిర్ధారణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎస్.సూర్యనారాయణ, గరివిడి ఎస్సై లోకేష్, చిన్న పిల్లల వైద్యుడు రమేష్, గైనకాలజిస్ట్ అర్చన, హ్యూమన్ రైట్స్ ప్రతినిధి వి.పద్మలత, ఆర్డీఓ కార్యాలయం ఏఓ ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌కు రంగులు



మెట్టకాలనీలో వాటర్ ట్యాంక్‌కు రంగులు వేయిస్తున్న మేజర్ పంచాయతీ అధికారి ఝాన్సీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్

సాక్షి ఎఫెక్ట్

చీపురుపల్లి: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాల్సిన వాటర్ ట్యాంక్‌లు, వాటిపై ఉండాల్సిన బోర్డులు నిర్లక్ష్యానికి గురవుతుండడంపై సంబంధిత అధికారులు స్పందించారు. రక్షిత మంచినీటి పథకాల శుభ్రతపై 'చెరిగిపోతున్న శుభ్రత' అనే శీర్షికన బుధవారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మేజర్ పంచాయతీ పరిధిలోని మెట్టకాలనీలో గల రక్షిత మంచినీటి పథకం వాటర్ ట్యాంక్‌కు గురువారం రంగులు వేయడంతో పాటు ట్యాంక్ లోపల శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మేజర్ పంచాయతీ అధికారి ఝాన్సీ మాట్లాడుతూ.. రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేయడమే కాకుండా వాటిని ఎప్పుడు శుభ్రపరుస్తున్నదీ బోర్డులో పొందుపరుస్తామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.